నక్సల్స్ ముక్త్ భారత్ మా ధ్యేయం

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

శెనార్తి మీడియా, కరీంనగర్ :

"2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించి 'నక్సల్స్ ముక్త్ భారత్' సాధిస్తాం. నక్సలైట్లతో చర్చలు జరిపి ఏం సాధించారు? తుపాకీ విడిచే వరకు చర్చలే లేవు, పరిష్కారాలూ లేవు" అని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన 'నక్సల్స్ నరమేధం–మేధోమథనం' చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ – "నక్సల్స్ తూటాలకు దాదాపు 50 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. 9 వేల మంది పోలీసులు బలయ్యారు. ప్రజాస్వామ్య విలువలను నాశనం చేశారు. అభివృద్ధిని అడ్డుకున్నారు" అన్నారు. "బ్యాలెట్–బుల్లెట్ ఒకే ఒరలో ఉండవు. ప్రజాస్వామ్యంలో తుపాకీ ఒక్కరే పట్టాలి. అది పోలీసులది కావాలి. తుపాకీతో అమాయకులను చంపుతుంటే చూస్తూ ఊరుకోం. ఏరిపారేసి తీరుతాం" అని హెచ్చరించారు. "బాక్సైట్ తవ్వకాల కోసమే ఆపరేషన్ కగార్ జరుగుతోందని చెప్పడం దుర్మార్గం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గనుల తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి" అన్నారు. "నక్సల్స్‌కు మద్దతు ఇస్తున్నవారిని విద్యా కమిషన్లలో నియమించడం సమాజానికి ఏ సందేశం?" అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బండి సంజయ్, నక్సల్స్ చేతిలో బలైన ఏబీవీపీ విద్యార్థులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత ప్రముఖ్ మాదాసి బాబూరావు, విభాగ్ ఇంఛార్జ్ అన్నల్ దాస్ మురళి, సంయుక్త కార్యదర్శి ముత్యాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ఫలాలను పేదలకు అందించిన

మహనీయుడు వాజ్‌పేయి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

శెనార్తి మీడియా, కరీంనగర్ :

"ప్రజాస్వామ్య ఫలాలను అట్టడుగున ఉన్న పేదవాడి వరకు తీసుకెళ్లిన మహనీయుడు, మానవతావాది, భరతమాత ముద్దు బిడ్డ వాజ్‌పేయి" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. "ప్రతిపక్షమంటే ప్రజల పక్షమని నిరూపించిన నేత వాజ్‌పేయి. ఆయన ఆలోచనల దారిలోనే నడుస్తూ భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ" అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. పదవుల కోసం ఎంతటికైనా దిగజారే నాయకులు ఉన్న ఈ రోజుల్లో, విలువల కోసం ప్రధాని పదవినే వదులుకున్న మహానేత వాజ్‌పేయి అని కొనియాడారు. రెండే ఎంపీ సీట్లతో ప్రారంభమైన బీజేపీని మూడుసార్లు ప్రభుత్వంలోకి తీసుకువచ్చిన పోరాటయోధుడు ఆయన అని గుర్తు చేశారు. "ఒకే ఓటు తేడాతో ప్రధాని పదవి కోల్పోయినప్పుడు కూడా అవినీతిపరమైన మార్గాలు అనుసరించకుండా ప్రజల వద్దకే వెళ్లడం వాజ్‌పేయి ప్రత్యేకత" అని సంజయ్ పేర్కొన్నారు. గ్రామీణ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టులతో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, పోక్రాన్ అణు పరీక్షలతో ప్రపంచానికి భారత్ శక్తిని చూపారని వివరించారు. వాజ్‌పేయి దూరదృష్టిని కొనసాగిస్తూ ప్రధాని మోదీ కూడా దేశాన్ని శక్తివంతం చేస్తున్నారని సంజయ్ అన్నారు. "కార్గిల్ పోరాటం వాజ్‌పేయి హయాంలో జరిగితే, మోదీ హయాంలో సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ జరిపి పాక్ వెన్నులో వణుకు పుట్టించారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చేసినది మోదీ కృషే" అని ఆయన అన్నారు.

వేములవాడ అభివృద్ధి పనులు వేగవంతం

భక్తుల సౌకర్యం కోసం రహదారి విస్తరణ : అధికారులు

శెనార్తి మీడియా, వేములవాడ

భక్తులకు మరింత సౌకర్యం కల్పించడానికి వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం ఎదుట ప్రధాన రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తరువాత ఆలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.47 కోట్లు మంజూరు చేసి, రోడ్డును 80 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే 254 ఇళ్లు, దుకాణాలను తొలగించగా, మట్టివ్యర్థాల తొలగింపుకు రూ.22 లక్షలు కేటాయించింది. హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ 45.5 శాతం తక్కువ ధరకు టెండర్ దక్కించుకుని మట్టి వ్యర్థాల తొలగింపు పనులను వేగవంతం చేసింది. వారం రోజుల్లో వ్యర్థాల తొలగింపు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు గడువు విధించారు. రోడ్డు విస్తరణ పనుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఈ పనులు పూర్తయిన తరువాత వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు మరింత సౌకర్యం లభించనుంది.

గ్రామస్థాయిలో నాయకత్వం పెంపే లక్ష్యం

ఆర్జీపీఆర్ఎస్ జాతీయ సమన్వయకర్త ఇమామ్ హసన్

శెనార్తి మీడియా, కరీంనగర్:

గ్రామస్థాయిలో ప్రతిభావంతులైన నాయకులను గుర్తించి వారిని పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో ముందుకు తీసుకెళ్లడమే రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్.జి.పి.ఆర్.ఎస్) ప్రధాన లక్ష్యమని జాతీయ సమన్వయకర్త ఇమామ్ హసన్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం జరిగిన ఆర్.జి.పి.ఆర్.ఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజల సమస్యలు, వాటి పరిష్కారాలు, వనరుల వినియోగం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం ఈ సంఘటన్ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిభ కలిగిన వారిని గుర్తించి వారిని సమర్థవంతమైన నాయకులుగా తీర్చిదిద్దడమే తమ యత్నమని వివరించారు. రాష్ట్ర సమన్వయకర్త వేణు గౌడ్ మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాల్లో ఆర్.జి.పి.ఆర్.ఎస్ విస్తరించిందని, మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణలో రెండు సంవత్సరాలుగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో గ్రామస్థాయి నుండి అసెంబ్లీ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ శక్తి చాటేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలపడాలంటే గ్రామస్థాయి పాలన బలపడాలని, అందుకే రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. జిల్లా చైర్మన్ మడుపు మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ లాగా ఆర్.జి.పి.ఆర్.ఎస్ కూడా కీలక విభాగమని, గ్రామీణ నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఇది ముందుంటుందని అన్నారు. సత్య ప్రసన్న రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్ కూడా ఈ సమావేశంలో మాట్లాడుతూ కమిటీల ద్వారా నాయకులకు సమాన అవకాశాలు కల్పిస్తామని, రాజకీయాలకే కాక పరిపాలనపై కూడా అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. గ్రామస్థాయి నుండి జడ్పీటీసీ, కార్పొరేటర్ స్థాయి వరకు పోటీ చేసిన లేదా పదవులు చేపట్టిన నాయకులు తమ అనుభవాలను వేదికపై పంచుకున్నారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండి తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, శ్రావణ్ నాయక్, కొర్వి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

- రైల్వే స్టేషన్‌లో జిఆర్పీ తనిఖీలు

శెనార్తి మీడియా, మంచిర్యాల :

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి జిఆర్పి పోలీసులు ఐదు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బెల్లంపల్లి నుంచి మహారాష్ట్ర వెళ్లే అజ్ని ప్యాసింజర్ రైల్లో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు జిఆర్పి ఏఎస్ఐ మోహన్ రాథోడ్ తెలిపారు. రామగుండం జిఆర్పి ఇన్స్పెక్టర్ లింగమయ్య ఆదేశాల పై తనిఖీలు నిర్వహించామన్నారు. పట్టుబడ్డ పిడిఎస్ బియ్యం విలువ సుమారు రూ.18 వేలుగా ఉంటుందని ఆయన తెలిపారు.

లక్ష్య సాధనకు కృషి..

- మందమర్రి శాంతిఖని లో మల్టీడిపార్టుమెంటల్ సమీక్ష

శెనార్తి మీడియా, మంచిర్యాల :

సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను సాధించాల్సిందిగా మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ పిలుపునిచ్చింది. సింగరేణి సి&ఎం.డి బలరాం ఆదేశాల మేరకు శనివారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని లో ఏరియా జీఎం జి. దేవేందర్ ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. కమిటీ సభ్యులు విజయ్ ప్రసాద్ (ఎస్ఓ టు జీఎం), బాలాజీ భగవతి జా (డి.జీ.ఎం ఈ అండ్ ఎం), ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ (డి.జీ.ఎం ఎఫ్ & ఏ), శ్యాంసుందర్ (పర్సనల్ మేనేజర్), కె.కిరణ్ కుమార్ (ఎస్ఇ ఐ.ఈ) తదితరులు పాల్గొన్నారు. మొదటి, రెండవ, మూడవ షిఫ్టులలో సమావేశాలు నిర్వహించి ఉత్పత్తి, యంత్రాల వినియోగం, సంక్షేమం, ఆర్థిక వ్యవహారాలపై విపులంగా చర్చించారు. కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, ఎదురున్న సవాళ్లపై అవగాహన కల్పిస్తూ, ఉద్యోగులు సూచనలను పాటించడం ద్వారా ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు. కేటాయించిన పనులను నిబద్ధతతో పూర్తి చేస్తే నిర్దేశిత లక్ష్యాలు చేరుకోగలమని చెప్పారు. పనితనం మెరుగుపరుచుకోవడం ద్వారా లక్ష్య సాధన సులభమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఎస్‌కె గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదిర్, గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, సంక్షేమ అధికారి రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

శెనార్తి మీడియా, అక్కన్నపేట:

"ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పాఠశాల అభివృద్ధి కోసం యువత ముందుకు రావాలి" అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2001–2002 పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు సుమారు 40 వేల రూపాయల విలువైన గేటును అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి గేటు ప్రారంభించారు. పాఠశాలకు గేటు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ సమస్యను పరిష్కరించిన పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉన్న మమకారం, బాధ్యతతోనే ఈ సహాయం చేశామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు వాసాల తిరుపతి, అనంతరెడ్డి రాజు, చిరంజీవి, బాపిరెడ్డి పరుశరాములు, రమేష్, యాదగిరి, ఇందిరా, సునీత తదితరులు పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు పరామర్శ

శెనార్తి మీడియా, గన్నేరువరం:

గన్నేరువరం మండలంలోని గన్నేరువరం, ఖాసీంపేట్, శనివారం గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను మానకొండూరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎంజిఆర్ యువ ఫౌండేషన్ తరఫున ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, 5 లీటర్ల నూనె అందజేశారు. పరామర్శ కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షులు నగునూరి శంకర్, మునిగంటి సత్తయ్య, గడ్డం సుమిత్ రెడ్డి, తాళ్లపల్లి పర్శరాము గౌడ్, బుర్ర

శ్రీనివాస్, వీరగోని వెంకటేష్, బామండ్ల రాజు, నందికొండ సురేందర్ రెడ్డి, గుంటి అంజి, సుమన్, బామండ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పునరుద్ధరణకు చర్యలు : కలెక్టర్

శెనార్తి మీడియా, మంచిర్యాల :

జిల్లాలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత చేపడతామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.శనివారం కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామపంచాయతీ పరిధిలో తుంతుంగ వాగు సమీపంలోని చెరువు పక్కన పాక్షికంగా దెబ్బతిన్న ఆర్ అండ్ బి రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి తదితరులు కలెక్టర్‌తో ఉన్నారు. తాత్కాలికంగా పైపులు వేసి మరమ్మతులు చేపట్టాలని ఆయన ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రాజెక్టులు, వాగులు, నదుల వద్దకు ఎవరు వెళ్లరాదని, పోలీసులు బందోబస్తు చేపడతారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు.అలాగే నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ (08736–250501) 24 గంటలు పనిచేస్తూ తక్షణ సహాయం అందిస్తోందని తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో కల్వర్టు నిర్మాణం చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు.